## రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు గొర్రెకుంట విద్యార్థి


బీ నందిని

గీసుగొండ, అక్టోబర్ 16 : రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు గ్రేటర్ వరంగల్ 15వ డివిజన్ గొర్రెకుంట ప్రభుత్వ జడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 10వ తరగతి విద్యార్థి బీ నందిని ఎంపికయ్యారని పీఈటీ రఘువీర్ తెలిపారు. ఈ నెల 14, 15 తేదీల్లో హనుమకొండలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. ఈ నెల 19, 20 తేదీల్లో మహబూబ్‌నగర్ జిల్లా నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా ఆమెను పలువురు సోమవారం అభినందనలు తెలిపారు.

## ఆర్టీసీ సేవలను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలి

పరకాల, అక్టోబర్ 16 : ఆర్టీసీ సేవలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ డిపో మేనేజర్ ఎం రవిచంద్ర సూచించారు. ఆర్టీసీ ఎండీ సజ్జనార్ గ్రాండ్ ఫెస్టివల్ వంద రోజుల చాలెంజ్‌ను చేపట్టినట్లు తెలిపారు. దీనిలో భాగంగా అక్టోబర్ 15 నుంచి జనవరి 22 వరకు వంద రోజుల పాటు ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ప్రత్యేక సర్వీసులను నడుపనున్నట్లు తెలిపారు. కాగా, పరకాల డిపో నుంచి పలు రూట్లలో ప్రత్యేక సర్వీసులను నడుపుతున్నామని, దీంతో పాటు ప్రతి ఆదివారం, శుక్రవారం వేములవాడకు ప్రత్యేక బస్సులను నడుపనున్నట్లు తెలిపారు. కాగా, ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాలని కోరారు.

## రైతులకు అందుబాటులో యూరియా

దామెర, అక్టోబర్ 16 : మండలంలోని ఊరుగొండలోని పీఏసీఎస్‌లో రైతులకు సరిపడా యూరియా అందుబాటులో ఉంచామని పెద్దాపురం పీఏసీఎస్ చైర్మన్ బొల్లు రాజు సోమవారం తెలిపారు. రైతులు పంటలు పండించేందుకు అవసరమైన రైతులు తమ పట్టాదార్ పాస్తుపుస్తకం జిరాక్స్‌లు సమర్పించి అవసరమైన మేరకు.. యూరియాను తీసుకోవాలని సూచించారు. రైతుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం యూరియాను అందుబాటులో ఉంచిందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## పత్తి పంటలో లింగాకర్షక బుట్టలను ఏర్పాటు చేసుకోవాలి


ఎలుకుర్తిలో పంట క్షేత్ర ప్రదర్శనలో శాస్త్రవేత్త వీరన్న

గీసుగొండ, అక్టోబర్ 16 : గులాబీ రంగు రంగు పురుగు నివారణకు పత్తి పంటలలో లింగకార్షక బుట్టలను ఏర్పాటు చేసుకోవాలని వ్యవసాయ శాస్త్రవేత్త వీరన్న సూచించారు. మండలంలోని అనంతారం, ఎలుకుర్తి గ్రామాల్లో సోమవారం పత్తిపంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక సాంద్రత పద్ధతిలో పత్తి పంటలు సాగు చేసిన రైతులకు అధిక దిగుబడి వస్తుందని సూచించారు. పంటలో గులాబీ రంగు పురుగుల నివారణ రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటించాలని సూచించారు. రైతులకు వ్యవసాయ అధికారులు అందుబాటులో ఉండి రైతులకు సలహాలు సూచనలు అందించాలన్నారు. ఏవో హరిప్రసాద్‌బాబు, ఏఈవో విజయ్ పాల్గొన్నారు.

## దుస్తుల పంపిణీ

గీసుగొండ, అక్టోబర్ 16 : గ్రేటర్ వరంగల్ 15వ డివిజన్ గొర్రెకుంటలో కల్వరీ చర్చిలో సోమవారం పేద క్రైస్తవులకు ఫాస్టర్ ప్రవీణ్ జోసఫ్ తన సొంత ఖర్చులతో దుస్తువులు పంపిణీ చేశారు. ప్రతి ఏడాది పేదవారికి సాయం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఫాస్టర్‌బాబు కుట్టి, ప్రశాంత పాల్గొన్నారు.

## పైడిపల్లి గౌడ సంఘం అధ్యక్షుడిగా రాజుగౌడ్


రాజుగౌడ్ (ఫైల్)

కాశీబుగ్గ, అక్టోబర్16 : గ్రేటర్ వరంగల్‌లోని 3వ డివిజన్ పైడిపల్లికి చెందిన ఆరే రాజుగౌడ్ గౌడ సంఘం అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం రాత్రి నిర్వహించిన సమావేశంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే ప్రధాన కార్యదర్శి వీరగోని రాజ్‌కుమార్, ఉపాధ్యక్షుడు సట్ల సాంబయ్య, కోశాధికారి కే శంకర్, సహాయ కార్యదర్శి కక్కెర్ల శ్రీధర్, కమిటీ సభ్యులుగా సట్ల సదానందం, కక్కెర్ల శ్రీను, కక్కెర్ల యాదగిరి, కందాల రవిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం రాజు గౌడ్ మాట్లాడుతూ పైడిపల్లిలోని గౌడ్ సామాజిక వర్గానికి చెందిన సభ్యుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. తన మీద నమ్మకంగా ఈ బాధ్యతలు అప్పగించిన గౌడ్స్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే నూతన కమిటీని పలువురు అభినందించారు.

# ఎన్నికలను సజావుగా నిర్వహించాలి

- కలెక్టర్ సిక్తా పట్నాయక్
- ఆర్డీవో కార్యాలయంలో ఎన్నికల అధికారులతో సమీక్షా సమావేశం


మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్

పరకాల, అక్టోబర్ 16: నోడల్ అధికారులు, అన్ని రకాల ఎన్నికల టీంలు సమష్టిగా విధులు నిర్వహించి ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు కృషి చేయాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో పలువురు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికారులకు ఎన్నికల విధులకు సంబంధించి పూర్తి అవగాహన ఉండాలన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా మద్యం, డబ్బులు, సరుకుల పంపిణీ, రవాణా జరిగినప్పుడు ప్రజలు సీ విజిల్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఫిర్యాదు దారుల వివరాలు గోప్యంగా ఉంచబడుతాయని తెలిపారు. ఎలువంటి ఆధారాలు లేకుండా రూ. 540 వేలకు మించి డబ్బులు తరలిస్తే స్వాధీనం చేసుకోవడం జరుగుతుందన్నారు. నియోజకవర్గానికి మూడు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఏ ఫిర్యాదు వచ్చినా వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు. పోలీసులు, ఎక్సైజ్ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. చెక్ పోస్టుల వద్ద ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలన్నారు. ఆర్డీవో శ్రీనివాస్, జడ్పీ సీఈవో శ్రీనివాస్, డీసీవో నాగేశ్వర్‌రావు, ఏసీపీ కిశోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధులకు ఇంటి వద్దే ఓటేసే అవకాశం..


మాట్లాడుతున్న ఎంపీడీవో కృష్ణమూర్తి

శాయంపేట, అక్టోబర్ 16 : ఎనభై ఏండ్లు నిండిన వృద్ధులతో పాటు దివ్యాంగులకు ఇంటి వద్దనే ఓటు వేసే అవకాశం ఎన్నికల కమిషన్ కల్పించిందని ఎంపీడీవో అమంచ కృష్ణమూర్తి అన్నారు. శాయంపేట మండల పరిషత్‌లో సోమవారం గ్రామ పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికలు నవంబర్ 30న జరుగుతాయన్నారు. కాగా, మండల పరిధిలోని గ్రామాల్లో 80 ఏండ్లు నిండిన వృద్ధులు, దివ్యాంగులను కార్యదర్శులు గుర్తించాలన్నారు. మండల పరిధిలో 832 మంది దివ్యాంగులు ఓటర్లు, 678 మంది 80 ఏండ్లు దాటిన ఓటర్లు ఉన్నట్లు పేర్కొన్నారు. వారి లిస్టును కార్యదర్శులకు అందజేసినట్లు తెలిపారు. కాగా, కార్యదర్శులంతా మంగళవారం గ్రామాల్లో వారింటికి వెళ్లి గుర్తించి లేవలేని స్థితిలో ఉన్నారా? పోలింగ్ స్టేషన్‌కు వచ్చి ఓటేసే పరిస్థితిలో ఎంతమంది ఉన్నారు. సర్వే చేయాలని సూచించారు. అలాంటి వారిని గుర్తించి ఫొటో తీసి పంపించాలన్నారు. అన్నింటికి క్రోడీకరించి కలెక్టర్‌కు పంపిస్తామన్నారు. తర్వాత పోలింగ్ బృందాలను ఏర్పాటుకు ప్రణాళికలు తయారు చేయాల్సి ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని ఎన్నికల కమిషన్ తొలిసారి కల్పిస్తున్నదని విజయవంతం చేయాల్సిన బాధ్యత ఉందన్నారు. సమావేశంలో కార్యదర్శులున్నారు.


శాయంపేట : గాయత్రిమాతగా దర్శనమిస్తున్న అమ్మవారు

## గాయత్రిమాతగా అమ్మవారు

శాయంపేట, అక్టోబర్ 16 : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు మండలవ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. రోజుకో రూపంలో అమ్మవారు దర్శనమిస్తున్నారు. మండలకేంద్రంలో ఎస్‌పీటీ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం అమ్మవారు గాయత్రి మాత రూపంలో దర్శనమిచ్చారు. అమ్మవారి విగ్రహ దాత శ్రీమత్యగిరి స్వామి ఆలయ చైర్మన్ సామల భిక్షపతి రాజమణి దంపతులు పూజలో పాల్గొన్నారు. పూజారి మామిడి శివసాయి గణపతి, నవగ్రహ, కుంకుమపూజ, దేవి అష్టోత్తరాలతో పూజ నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో యూత్ సభ్యులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అలాగే శాయంపేటలోని వేంకటేశ్వర శివ మార్కండేయ స్వామి ఆలయంలో అమ్మవారు గాయత్రి మాతగా దర్శనమిచ్చారు. అర్చకులు రాజ్‌కుమార్ పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

## గంగదేవిపల్లిలో బస్‌షెల్టర్ ప్రారంభం..

గీసుగొండ, అక్టోబర్ 16 : ఆదర్శ గ్రామ పంచాయతీ గంగదేవిపల్లి క్రాస్‌రోడ్డు వరంగల్ నర్సంపేట ప్రధాన రోడ్డులో బాలాజీ టెక్నాలజీ కళాశాల చైర్మన్ డాక్టర్ రాజేంద్రప్రసాద్‌రెడ్డి రూ.2 లక్షల 60 వేలు తన సొంత ఖర్చులతో బస్‌షెల్టర్‌ను ఏర్పాటు చేశారు. సోమవారం బస్‌షెల్టర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సౌకర్యార్థం బస్‌షెల్టర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మండలంలోని నుంచి తమ కళాశాల, పాఠశాలలో అత్యధిక మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ జర్నలిస్టు వెంకట్, రాఘురాం, గ్రామ తాగునీటి నిర్వహణ కమిటీ అధ్యక్షుడు కుమారస్వామి పాల్గొన్నారు.

# సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ

- పెద్దాపురంలో అంబరాన్నంటిన సంబురాలు
- వేడుకల్లో పాల్గొన్న పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సతీమణి జ్యోతి


మహిళలతో కలిసి బతుకమ్మ ఆడేందుకు వస్తున్న ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సతీమణి జ్యోతి

ఆత్మకూరు, అక్టోబర్ 16: తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ అని పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సతీమణి జ్యోతి అన్నారు. సోమవారం రాత్రి మండలంలోని పెద్దాపురం గ్రామంలో మూడో రోజు ముద్దపప్పు బతుకమ్మ ఉత్సవాల్లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి కాలనీలు కలియ తిరుగుతూ మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం గ్రామంలోని రామాలయం ఆవరణంలో మహిళలతో కలిసి బతుకమ్మ ఆడిపాడారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ కక్కెర్ల రాధిక, రైతుబంధు సమితి మండల కోఆర్డినేటర్ రవీందర్, సర్పంచ్‌లు కమల, జిల్లెపల్లి రాజేశ్వరీ, మాజీ మార్కెట్ చైర్మన్ కేశవరెడ్డి, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు సంజీవరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి కుమారస్వామి, నాయకులు బుచ్చిరెడ్డి, రాజు, వేముల నవీన్, రాజేశ్వర్‌రావు, ఉప సర్పంచ్ వనమాల, వివిధ గ్రామాల బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గ్రామాల్లో బెల్ట్‌షాపులు నిర్వహించొద్దు


బాటిళ్లను స్వాధీనం చేసుకున్న సీఐ రవిరాజు

ఆత్మకూరు,అక్టోబర్16: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా ఉండేందుకు గ్రామాలల్లో బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్న వారిపై కేసులు నమోదు చేస్తామని సిఐ రవిరాజు హెచ్చరించారు.సోమవారం రాత్రి ఆత్మకూరు మండలం అక్కంపేట గ్రామంలో బెల్ట్‌షాపు నిర్వహిస్తున్న ఎండి సాధిక్ ఇంట్లో సోదాలు చేయగా రూ.16,380ల విలువ కల్గిన మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకొని సీజ్ చేశామన్నారు.గ్రామాలల్లో ఇష్టాను సారంగా బెల్ట్‌షాపులు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎస్సై రాజేశ్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.